RNI. No. TELTEL /2022/ 89348




మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 4 సంచిక : 88 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | శనివారం, మార్చి, 21, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## తెలంగాణ శాసనసభ

# సోమవారానికి వాయిదా



**హైదరాబాద్,మార్చి,20:** తెలంగాణ శాసనసభ(ంవశ్రీఖఅస్త్రుఖఅఖ ూంంవఎఎశ్రీఎ) వాయిదా పడింది. ఈరోజు సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు ఆర్థిక మంత్రి. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు. బడ్జెట్ ప్రసంగం పూర్తి అయిన అనంతరం స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. కాగా... ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం కొనసాగతుండగానే సభ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. అన్ని వర్గాలను మోసం చేశారంటూ.. చెవిలో పూలు పెట్టుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను చించివేశారు. బడ్జెట్ మొత్తం మోసం.. మోసమంటూ బీఆర్ఎస్ సభలో నిరసనలు తెలిపింది. ఆరు గ్యారంటీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవంటూ బీఆర్ఎస్ నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. సభ నుంచి బీఆర్ఎస్ నేతల వాకౌట్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రసంగం ముగిసే వరకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నీళ్లు కూడా తాగలేదన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం బడ్జెట్‌ను విమర్శిస్తూ చెవిలో పువ్వులు పెట్టుకొని వెళ్లిపోయారని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు బడ్జెట్ ప్రతులను చించివేయడం బాధాకరమన్నారు. ఈ బడ్జెట్ పేదలు, బీసీ, ఎస్సీ, విద్యార్థులకు ఉపయోగకరమైనదన్నారు. పేదలు, విద్యార్థుల గురించి మాట్లాడే సమయంలోనే బీఆర్ఎస్ వాళ్లు వెళ్లిపోయారని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

## టైగర్ రిజర్వ్ టూరిజంపై ప్రభుత్వం ఫోకస్.. రూ.875 కోట్లు కేటాయింపు

**హైదరాబాద్,మార్చి,20:**పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం టెంపుల్ టూరిజం, టైగర్ రిజర్వ్ టూరిజంపై కూడా స్పెషల్ ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్రంలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అభివృద్ధి చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. రాష్ట్ర బడ్జెట్ లో కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ లలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.875 కోట్లు కేటాయించింది. పులుల సంరక్షణతోపాటు సందర్శకుల కోసం ప్రత్యేక మౌలిక సదుపాయాలను ఏర్పాట్లు చేయనున్నారు. దీంతోపాటు కొత్త యూనిట్లను సైతం ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు వన్య ప్రాణుల నిర్వహణను ఇంటిగ్రేట్ చేయడానికి బడ్జెట్ లో రూ.37జ48కోట్లు కేటాయించారు.

# రూ. 3.24 లక్షల కోట్లతో తెలంగాణ 2026-27 బడ్జెట్..



శాసనసభలో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి,

**హైదరాబాద్,మార్చి,20:**2026-27: తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. రూ.3.24 లక్షల కోట్లతో తెలంగాణ బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశ పెట్టారు. శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రవేశ పెట్టారు. 2026-27 ఏడాదికి గానూ 3,24,234 కోట్లు అంచనా వేశారు. రాష్ట్రంలోని 118 అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రతినెల 2 వేల స్కాలర్ షిప్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఇక శాఖల వారీగా బడ్జెట్ వివరాలు ఇవే.. ఇందులో రైతు భరోసాకు రూ. 18,000 కోట్లు, చేయుతకు ం 4,305 కోట్లు, సన్న వడ్ల బోనస్ కు రూ. 3,500 కోట్లు, గృహ జ్యోతి (200 యూనిట్లు ఉచిత విద్యుత్) రూ. 2,080 కోట్లు, రాజీవ్ ఆరోగ్య శ్రీకి రూ. 1,143 కోట్లు, మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీకి రూ. 723 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ. 600 కోట్లు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలు, వృద్ధులు, అభాగ్యులకు అండగా నిలుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. 'చేయూత' పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది.

### ఏ శాఖకు ఎంతంటే

విద్యా శాఖకు రూ. 26,674కోట్లు
వైద్య, ఆరోగ్య శాఖకు రూ. 13,679 కోట్లు
పశు సంవర్ధక శాఖకు రూ. 1,529 కోట్లు
విద్యుత్ శాఖకు రూ. 21,285 కోట్లు
కార్మిక శాఖకు రూ. 998కోట్లు
మహిళా శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
ఎస్సీ సంక్షేమానికి రూ. 11,784 కోట్లు
ఎస్టీ సంక్షేమానికి రూ. 7,937 కోట్లు
బీసీ సంక్షేమానికి రూ. 3,769 కోట్లు
రాజీవ్ యువ వికాసానికి రూ. 6 వేల కోట్లు
గృహ నిర్మాణ శాఖకు రూ. 7,430కోట్లు
పరిశ్రమల శాఖకు రూ.3490 కోట్లు
చేనేత రంగానికి రూ. 258 కోట్లు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ. 33, 688 కోట్లు
ఆర్ అండ్ బి శాఖకు రూ. 12,789 కోట్లు
న్యాయ శాఖకు రూ. 2,367కోట్లు
ఎ -ఎ్‌ఱ పథకం కింద రూ. 2,654 కోట్లు
పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.17,907 కోట్లు
హోం శాఖకు రూ. 11,907 కోట్లు
గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రూ. 500 కోట్లు
పర్యాటక శాఖకు రూ. 1224 కోట్లు



# సంపాదకీయం

## బయో ఫ్యూయెల్‌కు ప్రోత్సాహం నిల్..

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళి మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహోలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశం

# విద్యాదానం చేస్తా మెగాస్టార్ చిరంజీవి

### - ఈ విషయం లో హీరో సూర్య నాకు స్ఫూర్తి- ఆగారం ఫౌండేషన్ తరహా విద్యా సేవలు- దాసరి. స్వప్న మహేష్ సామాజిక కార్యకర్త ఆనందం తో చిందులు...



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) మెగాస్టార్ కొణిదెల శివ శంకర వర ప్రసాద్ చిరంజీవి టాలీవుడ్ లో సంచలన నిర్ణయం తీసుకున్నారు. సినీ, రాజకీయ, సామాజిక సేవ రంగములో తన దైన శైలిలో ఎన్నో ప్రజా సేవలు, కళ సేవలను అందించిన చిరంజీవి ప్రజల కోసం మరో సామాజిక సేవ దృక్పధం తో ముందుకు రావడం గొప్ప నిర్ణయం గా అభిమానులు భావిస్తున్నారు. చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సంవత్సరాలనుండి బ్లడ్ బ్యాంకు నడుస్తుంది. ఎంతోమంది వ్యాధిగ్రస్థులకు ఉచితంగా రక్తదానం చేసిన ఘనత మెగాస్టార్ చిరంజీవి ట్రస్ట్ కె చెందింది. ఇటీవల కేంద్రప్రభుత్వం నుండి చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ కి విదేశాల నుండి విరాళాలు పొందడానికి అనుమతులు వచ్చిన విషయం తెలిసినదే. ఈ క్రమంలో తమిళం సినీ హీరో సూర్య ఆగారం ఫౌండేషన్ ద్వారా వేయిల మంది విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యా ఇస్తున్నారు. అదే మాదిరిగా చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని పేద విద్యార్థులకు ఉచితంగా ఉన్నత చదువులకు సహాయం అందిస్తానని ఉగాది పర్వదినం సందర్భంగా సంచలన నిర్ణయం ప్రకటించడం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు అద్భుత వరం గా అభిమానులు తెలుపుతున్నారు. జీవితం లో సంపాదించడమే కాదు దానం చేయడం చాలా గొప్ప హృదయం అని అది అన్నయ్య చిరంజీవి కి చాలా ఉందని సంతోషం తో అభిమాన సంఘాలు వర్ణిస్తున్నారు. ఏది ఏమైనా ఈ విద్యా దానం విషయం లో మెగాస్టార్ కి తమిళం హీరో, ఆగారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు సూర్య నే స్ఫూర్తి అని చిరంజీవి తెలిపారు. ఉన్నత విద్యా చదవాలని ఆశయం ఉన్న విద్యార్థులు చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ కి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దీనితో రామగుండం కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త మెగా కుటుంబం అభిమాని దాసరి స్వప్న మహేష్ ఆనందం వ్యక్తం చేసి, చిందులు వేసారు.

# పరాభవ నామ సంవత్సర ఉగాధి శుభాకాంక్షలు" తెలిపి అందరికి ఉగాది పచ్చిడి పంపిణీ చేసిన ఆర్జీ-1 జియం లలిత్ కుమార్





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) తెలుగు సంవత్సర "శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాధి శుభాకాంక్షలు" తెలిపి అందరికి ఉగాది పచ్చిడి పంపిణీ చేసిన ఆర్జీ-1 జియం లలిత్ కుమార్ . రామగుండం ఏరియా -1 జియం కార్యలయం సమావేశహాలు నందు సింగరేణి ఉద్యోగులకు మరియు వారి కుటుంబ సభ్యులకు, అధికారులకు, సూపర్ వైజర్లకు, యూనియన్ ప్రతినిదులకు, పుర ప్రజలకు ఆర్జీ-1 జియం శ్రీ లలిత్ కుమార్ గారు శ్రీ పరాభవ నామ ఉగాది శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భముగా జియం కార్యలయం ఉద్యోగులకు ఉగాది పచ్చడిని పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆర్జీ-1 జియం శ్రీ లలిత్ కుమార్ గారు మాట్లాడుతూ ప్రత్యేకించి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఐ.ఏ.ఎస్ చైర్మన్ అండ్ ఎం.డి. గారి ఉగాది శుభాకాంక్షల సందేశాన్ని అధికారులకు మరియు ఉద్యోగులకు అందరికి ప్రత్యేకంగా తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రతీ ఒక్కరు సుఖ సంతోషాలతో భాసిల్లాలని, ఆయురారోగ్యలతో వర్ధిల్లాలని తెలిపారు. వసంత రుతువులో వచ్చే ఉగాది పండగ మార్పునకు సంకేతమని మనం కూడా మార్పుకు అనుగుణంగా మన నడవడిని మార్చుకొని కొత్త ఒరవడికి స్వాగతించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామగుండం రీజియన్ క్వాలిటీ జనరల్ మేనేజర్ సుజోయ్ మజుందార్, ఎజియం క్వాలిటి నాగేశ్వర్ రావు, ఏజంట్ చిలుక శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ యం.రవీందర్ రెడ్డి, (సియంవోఐఏ) ప్రతినిధి క్రాంతి కుమార్, డిజియం ఫైనాన్స్ ధనలక్ష్మి బాయి, వివిధ శాఖాధిపతులు, అధికారులు జిఎం ఆఫీస్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

## తమిళనాడు రాష్ట్రంలో ఘటన

చెన్నై, మార్చి 20: తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనాలను ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన సేలం జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం ఓ ఆర్టీసీ బస్సు కోయంబత్తూరు నుంచి సేలం బయలుదేరింది. బస్సు ఉత్తమ శోలపురం దగ్గర హైవేపై వెళుతుండగా అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళుతున్న ఓ బైక్‌తో పాటు టెంపోను ఢీకొట్టింది. బైక్, టెంపో నుజ్జునుజ్జయ్యాయి. బైకుపై ప్రయాణిస్తున్న ఓ మహిళతో పాటు ఆమె కూతురు అక్కడికక్కడే మరణించారు. ఇక.. టెంపోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో 11 నెలల చంటిపాప కూడా ఉండటం విషాదకరం. సమాచారం



అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ సభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు

# ఆత్మవిశ్వాసమే ఆలంబనగా

ఆమెకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. అందులోనూ రన్నింగ్, జాగింగ్, షటిల్, బ్యాడ్మింటెన్, ఖోఖో వంటి ఆటలను అవలీలగా ఆడేస్తుంటారు. జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో అనేక పతకాలను కైవసం చేసుకు న్నారు. ఓ వైపు చదువు, మరోవైపు క్రీడల్లోనూ రాణిస్తూ రెండు వైపులా రాటుదేలారు. చిన్నప్పటి నుంచే ఆమెకు పర్వతప్రాంతాల్లో పర్యటించటం ఎంతో ఇష్టం. అధిరోహించిన వారి వివరాలు తెలుసుకుంటూ ఉండేవారు. తను కూడా వారి మాదిరిగానే తయారు కావా లనే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే మనదేశంలోని అనేక పర్వతాలను అధిరోహిం చారు. తాజాగా దక్షిణ అమెరికాలోని అత్యంత ఎత్తయిన పర్వతం మోంట్ ఏకాం కాగ్వా (6962 మీటర్లను) ఆమె అధిరోహించి రికార్డు నెలకొల్పారు. ఆమె రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ఎస్.భరణి సివిల్ సర్వీసెస్ ద్వారా ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. పోస్టింగ్ రీత్యా ఆంధ్రప్రదేశ్‌కు ఐఎఫ్ఎస్ అధికారిణి హోదాలో శాప్ ఎండిగానూ, వైస్‌చైర్మన్‌గానూ, ఎపి యూత్ సర్వీసెస్ కమిషనర్, ఎపి సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లారుమెంట్ ప్రమోషన్ (స్టెప్) ఎండిగా కూడా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మోంట్ ఏకాంకాగ్వా శిఖరాన్ని అధిరోహిం చిన అధికారిణిగా ఆమె నిలిచారు. 2026, జనవరి 8న దక్షిణ అమెరికా అర్జెంటైనాలో ఉన్న మోంట్ ఏకాంకాగ్వా పర్వత శిఖరాన్ని అధిరోహించటానికి ఆమె బయలుదేరి వెళ్లారు. 19 రోజుల్లో ఈ శిఖరాన్ని అధిరో హించాలనే లక్ష్యాన్ని పెట్టుకోగా ఈనెల 20నే అంటే లక్ష్యానికి ఆరురోజులకు ముందుగానే ఆమె పర్వతారోహణ పూర్తిచేసేశారు. తీవ్రమైన మంచు, మంచుగడ్డలు విరిగిపడతాయనే హెచ్చరికల నడుమ, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఆమె లక్ష్యాన్ని సాధించేందుకు ముందుకు సాగారు. ఈ ప్రయాణంలో కొన్నిసార్లు పడటం, కొన్ని దెబ్బలు తగలటం, నొప్పులతో ఇబ్బందులు పడిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. తన ముందున్న లక్ష్యాన్ని సాధించాలనే తపన ముందు అవేమీ అడ్డంకి కాలేదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగారు. అథ్లెటిక్‌గా తనకున్న ప్రావీణ్యం కూడా ఈ శిఖర అధిరోహరణకు దోహదపడింది. పాఠశాలస్థాయిలోనే ఆమె ఆటలంటే ఎంతో ఇష్టం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేసేవారు. పరుగుపందెం పోటీలన్నింటిలోనూ పాల్గొని తన సత్తా చాటేవారు. మిగతా ఆటల్లోనూ చురుగ్గా పాల్గొనే వారు. లాంగ్‌జంప్, హైజంప్, స్విమ్మింగ్, సైక్లింగ్, రేస్ వాకింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పలు బహుమతులను అందు కున్నారు. అథ్లెటిక్స్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జా తీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలను సైతం కైవసం చేసుకున్నారు. ప్రాథమిక విద్యాభ్యాస మంతా కోయంబత్తూరులోనే సాగింది. పోస్టు గ్రాడ్యుయేషన్ తర్వాత ఆమె సివిల్స్ రాసి అందులో ర్యాంకు సాధించి ఉన్నత హోదాలో నిలిచారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధంగా: 'ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకపోవటం కంటే..ప్రయత్నించి ఓడిపోవడమే మేలు' అన్న స్వామి వివేకానంద స్ఫూర్తిని ఆమె తీసు కున్నారు. 'అడుగేయాలి.. ముళ్లమార్గాన్ని అన్వేషిం చాలి.. అలుపొస్తున్నా కలలే కన్నా. అనుకున్నది అధిరోహించాలి' అంటూ చంద్రబోస్ రాసిన పాటే ప్రేరణగా ఆమె ముందుకు సాగుతున్నారు. పర్వతారోహణ లక్ష్యాన్ని ఎంచుకున్నప్పుడు భరణి మొదట్లో భయపడ్డారు. నేను ఇది 'సాధించగలనా?' అని కొద్దిగా సంకోచించారు. ఆతర్వాత ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుని ఆమె లక్ష్యసాధన కోసం అహరహం కష్టపడ్డారు.

తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు కూడా తను ఎంచుకున్న లక్ష్యానికి అడ్డు చెప్పలేదు. ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లేవారు. సాహస కృత్యాలు చేయటం కూడా చిన్నప్పటి నుంచే ఆమెకు అలవాటు. కోవిడ్ సమయంలో ఖాళీ సమయాల్లో ఏదో ఒకటి సాధిం చాలనే కుతూహలంతో పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్నారు. కోయంబత్తూరు పరిసర ప్రాంతాల్లోని కొండలను కొన్ని సార్లు ఎక్కారు. ఆ తర్వాత హిమాలయాల్లోని కొండలను తిలకించి ఎక్కేశారు. ఆ తర్వాత కొండంత ఆత్మవిశ్వా సాన్ని ప్రోగుచేసుకుని ప్రపంచంలోనే ఎత్తయిన పర్వత శిఖరాలను అధిరోహిం చాలనే లక్ష్యాన్ని రూపొందించుకున్నారు. మైనస్ 18 నుంచి 20 డిగ్రీల ఉష్ణోగ్రతలను తట్టుకుంటూ లోయలాంటి ప్రదేశాల్లో పడిపోకుండా అత్యంత జాగ్రత్తగా అడుగులు వేయటాన్ని ప్రాక్టీస్ చేశారు. పర్వత శిఖరా లకు వెళ్లి అక్కడి చలి పరిస్థితులను తట్టుకునేలా కొన్ని రోజుల పాటు శిఖరారోహణ క్రమంలో ప్రాక్టీస్ చేశారు. అధిరోహించటానికి వెళ్లిన సందర్భాల్లో తట్టుకోలేక కన్నీళ్లు పెట్టుకున్న సందర్భమూలు అనేకం ఉన్నాయి. అర్జంటైనాలో 12 రోజులపాటు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ట్రెక్కింగ్ కూడా కొనసాగింది. సమ్మిట్ పుష్‌కు బయలు దేరి ఆ తర్వాత శిఖరాన్ని చేరుకున్నారు.

పర్వతాలను అధిరోహించటమే లక్ష్యంగా: ముందుగా ప్రపంచంలోని ఎత్తయిన కొండల గురించి తెలుసుకుని ఆ తర్వాత వాటిని అధిరోహిం చేందుకు ఉన్న అవకాశాలు, ఇబ్బందులు,







# సామరస్యమే భారతీయం!

## భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ఔన్నత్యం




అన్ని మతాలను, సంస్కృతులను గౌరవించటం మన వారసత్వం. కానీ, ఇటీవల కొంతమంది మతోన్మాదంతో ఈ సంస్కృతికి భంగం కలిగిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మతం పేరిట ఉన్మాదాన్ని రెచ్చగొట్టటం, వివాదాలు సృష్టించటం తరచూ చూస్తున్నాం. ఉత్తరాఖండ్‌లో ఒక మతోన్మాద మూక ఇలాంటి వివాదాన్నే రగిలించబోతే- ధైర్యంగా ఎదుర్కొన్నాడు దీపక్ కుమార్. 'మనుషుల మధ్య పెరగాల్సింది ప్రేమ. విద్వేషం కానేకాదు." అని గట్టిగా చెప్పి, మానవత్వానికి, మనిషితనానికీ ప్రతీకగా నిలిచాడు. మతాల పేరుతో మనుషుల మధ్య చిచ్చుపెట్టాలని ఉన్మాదులు ప్రయత్నించిన ప్రతిసారీ ఇక్కడ 'మతం కంటే మానవత్వం గొప్పది' అని నిరూపితమవుతూనే ఉంది. తాజాగా ఉత్తరాఖండ్‌లో జరిగిన ఉదంతం మరోసారి దాన్ని రుజువు చేస్తోంది. అయితే ఈ సారి మరింత ప్రభావ వంతంగా కనిపిస్తోంది. నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధ ముస్లింకి అండగా నిలబడిన హిందూ యువకుడిని, దాడి చేస్తున్న మూక 'నువ్వెవరు?' అని ప్రశ్నించింది. అప్పుడు ఆ యువకుడు..'నేను.. మహ్మద్ దీపక్‌ని. నేను హిందువుని. అంతకంటే ముందు నేను భారతీయుడిని' అని తీక్షణమైన చూపులతో సమాధానం చెప్పాడు. ఆ మాటలు మాట్లాడుతున్న దీపక్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'రాజ్యాంగ బద్ధంగా ఈ దేశాన్ని పాలించుకుంటాం' అని ప్రమాణం చేసుకుని 75 ఏళ్ల గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న రోజున, ఆ స్ఫూర్తికి విరుద్ధంగా ఈ ఘటన జరిగింది. ఉత్తరాఖండ్ కొత్ద్వార్ పటేల్ వీధిలో 70 ఏళ్ల ముస్లిం వ్యక్తి 'బాబా స్కూల్ డ్రెస్ అండ్ మ్యాచింగ్ సెంటర్' పేరుతో ఓ దుకాణం నడుపుతున్నారు. మూడు దశాబ్దాలుగా ఆ పేరుతోనే నిర్వహిస్తున్నారు. ఇప్పుడు ఆయన పార్కిన్సన్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన కుమారుడు షోయబ్ షాపు బాధ్యతలు తీసుకున్నారు. మొన్న జనవరి 26న కొంతమంది భజరంగ్ దళ్ వ్యక్తులు వచ్చి షాపులో ఉన్న షోయబ్‌ని, ఆయన తండ్రిని తీవ్ర దుర్భాషలాడారు. 'బాబా' పేరు హిందువుల పేరని, ఆ పేరుతో షాపు నిర్వహించకూడదని హుకుం జారీచేశారు. హిందూ పేరు పెట్టుకుని ఓ ముస్లిం షాపు నడపడం ఏంటని కళ్లెర్రజేశారు. ఈ హఠాత్ పరిణామానికి ఆ వృద్ధుడు నిలువెల్లా కంపించిపోయాడు. షోయబ్ ఆ వ్యక్తులకి సర్దిచెప్పేందుకు నానా తిప్పలు పడుతున్నాడు. ఇది కొత్తగా పెట్టుకున్నది కాదని, 30 ఏళ్ల నుండి దీన్ని ఇలాగే నడుపుకుంటున్నామని బతిమా లాడాడు. అయినా ఆ మూక వినిపించుకోలేదు. గట్టి గట్టిగా అరుస్తూ వాళ్లని భయభ్రాంతులకు గురిచేశారు. అప్పుడు అక్కడే, పక్క షాపులో ఉన్న దీపక్ ఈ మొత్తం వ్యవహారాన్ని చూశాడు. వెంటనే ఆ మూకని ఎదుర్కొనేందుకు, ఆ ముస్లిం సోదరులకి సాయంగా ఉండేందుకు ముందుకు వచ్చాడు. దీపక్ మామూలుగా రాలేదు. 'ఏంటి భారు ఈ గలాటా! 'బాబా' పేరు పెట్టుకుంటే మీకేంటి? ముందు ఇక్కడి నుండి వెళ్లిపోండి?' అని తీవ్రస్వరంతో చెప్పాడు. వెంటనే మూకలోని ఓ వ్యక్తి 'నువ్వెవరు? అసలు వీళ్లకి నువ్వు ఏమవుతావు?' అని ప్రశ్నించాడు. 'నేను మహ్మద్ దీపక్!. నేను హిందువుని. నా మతం అంటే నాకు ఎనలేని గౌరవం. అయితే అంతకంటే ముందు నేను భారతీయుడిని' అని దీపక్ సమాధానం చెప్పాడు. ఇదంతా జరుగుతున్నప్పుడే మరికొంతమంది హిందూ యువకులు వచ్చి దీపక్‌కి సాయంగా నిలబడ్డారు. మూకని వెళ్లగొట్టారు. గొడవ ఇంతటితో ఆగిపోలేదు. మూకతో దీపక్ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మత సామరస్యానికి చిహ్నంగా నిలిచిన అతని ధైర్యసాహసాలకి దేశ నలుమూలల నుండి ప్రశంసలు వెల్లువెత్తాయి. అది సహించలేని కుహనా దేశభక్తులు ఈసారి దీపక్‌పై తమ ద్వేషాన్ని వెళ్లగక్కారు. జనవరి 31న జిమ్ నిర్వాహకుడైన దీపక్‌కి వ్యతిరేక నినాదాలు చేస్తూ వందల సంఖ్యలో భజరంగ్ దళ్ సభ్యులు కొత్ద్వార్ చేరుకున్నారు. దీపక్ 'జిమ్'ని దిగ్బంధం చేశారు. 'ముస్లిం వ్యతిరేక నినాదాలు చేస్తూ.. నువ్వు కూడా వాళ్లల్లో చేరిపో' అని దుర్భాషలాడారు. అయినా వాళ్ల అక్కసు చావలేదు. వృద్ధుడైన 60 ఏళ్ల తమ కార్యకర్తపై దీపక్ దాడి చేశాడని నిందలు వేసి, పోలీసు స్టేషనులో కేసు పెట్టారు. ఇక్కడ విచారించాల్సిన విషయం మరొకటి జరిగింది. ఆ రోజు జరిగిన దాడిలో ఇరుపల నుండి వచ్చిన ఫిర్యాదులని తీసుకున్న పోలీసులు మూక సభ్యులని వదిలిపెట్టి, దీపక్‌ని పోలీస్ స్టేషనుకి తీసుకెళ్లారు. పగలంతా అక్కడే వుంచి రాత్రికి ఇంటికి పంపారు. దీపక్‌పై వాళ్లు పెట్టిన కేసు ఇంకా ఉంది. దీపక్‌ని, కుటుంబసభ్యులని బెదిరిస్తూ అప్పటి నుండి ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. జిమ్ కూడా మూతబడింది. ఇదంతా దీపక్‌కి వచ్చిన అనుకోని కష్టం. దీనిపై దీపక్ మాట్లాడుతూ, 'వాళ్లు ఎన్ని బెదిరించినా నేను భయపడను. ఆ రోజు నేను ఏదైతే చెప్పానో (మహ్మద్ దీపక్) దానికే కట్టుబడి ఉంటాను. ఈ దేశంలో అన్ని మతాలు సమానం. ఇక్కడ ఎవరూ హిందువులు, ముస్లింలు, సిక్కులు, జైనులు కాదు. అందరూ భారతీయులు. మతం కంటే ఇక్కడ మానవత్వం కనిపిస్తుంది. అందుకే ఆ రోజు నేను వాళ్లకి అండగా నిలబడ్డాను. నాలాగే ఈ దేశంలో ఎంతోమంది ఉన్నారు. వారే అసలైన భారతీయులు. నా సహోదరులు' అని దీపక్ ఎంతో గంభీరంగా చెప్పాడు. 'భారతీయత' అన్న పదానికి అసలైన అర్థం ఇదే కదా!: ఈ ఘటన తరువాత వస్త్ర దుకాణాల కమిటీ వ్యక్తులు కూడా దీనిపై స్పందించారు. 'మతం పేరుతో మా మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే మేం ఊరుకోం. ఎప్పటి నుండో మేమంతా కలిసిమెలిసి ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నాం. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదు. ఇప్పుడు మీరు వచ్చి గలాటా చేస్తుంటే చూస్తూ కూర్చోం' అంటూ ఖరాఖండిగా మధ్య వయస్కుడైన ఓ హిందూ వ్యక్తి మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడో ఓ చోట ఈ తరహా ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. విద్వేషం రెచ్చగొట్టాలని చూసిన ప్రతిసారీ హిందూ, ముస్లిం ఐక్యతని చాటే వ్యక్తులు కనపడుతూనే ఉన్నారు. మొన్నీమధ్య తమకి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాడని, అధికారుల సాయంతో కాశ్మీరీ ముస్లిం జర్నలిస్టు ఇంటిని కూల్చేస్తే, వాళ్లకి తన ఇంటి పత్రాలు ఇచ్చి దాతృత్వం చాటుకున్న వ్యక్తి ఓ హిందువు. 'ముస్లిం దర్జీల దగ్గరికి హిందూ మహిళలు వెళ్లొద్దని, కొలతల పేరుతో వారు అసభ్యంగా ప్రవర్తిస్తార'ని 24 ఏళ్ల కిందట ఆంక్షలు పెట్టినప్పుడు ప్రముఖ పర్యావరణ వేత్త, పద్మ భూషణ్ గ్రహీత డాక్టర్ అనిల్ పి.జోషి భార్య సంధ్య జోషి, ఆమె సోదరి గీతా ఆ ఆరోపణలని తీవ్రంగా ఖండించారు. దర్జీ దగ్గరకి వెళ్లకుండా వారిని అడ్డుకున్న విహెచ్‌పి, భజరంగ్‌దళ్ సభ్యులతో వాగ్వాదానికి కూడా దిగారు. దశాబ్దాల నుండి భారతదేశంలో ఇదే జరుగుతోంది. ఈ సామరస్య వాతావరణాన్ని చెడగొట్టేందుకు, పాలకుల అండతో మూకలు ఇప్పుడు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. ఆ మూకకి సరైన సమాధానం చెప్పాలంటే దీపక్ లాంటి శక్తిమంత యువత ఇప్పుడు దేశానికి చాలా అవసరం.

## రేవంత్ రెడ్డి వెలమలకు క్షమాపణ చెప్పాలి

హనుమకొండ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వెలమల పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే వెలమలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వేలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం హనుమకొండ ఏకశీల పార్క్ వద్ద వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి డీఆర్‌ఓ వై.వీ. గణేష్ కు వినతి పత్రం అందించారు. ఒక కులాన్ని టార్గెట్గా చేసుకొని అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు అన్నారు. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధిస్తే తెలంగాణ ప్రజలందరూ జాతిపిత అని గర్విస్తుంటే రేవంత్ రెడ్డి ఓర్వలేక పోతున్నారని అన్నారు.

## సోషల్ మీడియాతో పిల్లల్లో ఏకాగ్రత లోపం!

### తాజా అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, : సోషల్ మీడియాపై గంటల తరబడి గడిపే పిల్లల్లో మానసిక ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు దెబ్బతింటున్నాయని, ఏకాగ్రత లోపిస్తున్నదని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. అమెరికా వ్యాప్తంగా పిల్లలపై జరిగిన ఓ అధ్యయనం ప్రకారం, స్మార్ట్‌ఫోన్‌పై తరుచూ స్క్రోలింగ్, నోటిఫికేషన్‌లను చూస్తూ గడపటం.. పిల్లల్లో 'ఏడీహెచ్‌డీ' వంటి లక్షణాల్ని (చంచల స్వభావం, పనిపై శ్రద్ధ లేకుండుట) పెంచుతున్నదని పరిశోధకులు గుర్తించారు. అమెరికాలో సగటున ప్రతి పిల్లాడు టీవీ, ఆన్‌లైన్ వీడియోలపై రోజూ సగటున 2.3 గంటలు, సోషల్ మీడియా కోసం 1.4 గంటలు, వీడియో గేమ్స్‌పై 1.5 గంటలు గడుపుతున్నాడట. అయితే ఇందులో సోషల్ మీడియా ఒక్కటే పిల్లల ఏకాగ్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. అన్ని రకాల 'స్క్రీన్ టైమ్' పిల్లలపై ఒకేవిధమైన ప్రభావం చూపటం లేదన్న విషయం వీరి పరిశోధనలో తేలింది. స్వీడన్‌కు చెందిన కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, యూఎస్‌కు చెందిన ఒరేగావ్ హెల్త్, సైన్స్ వర్సిటీ పరిశోధకులు సంయుక్తంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు.

## పేదవాడి మెతుకు కార్డుపై అధికారుల నిర్లక్ష్యం

ఇటిక్యాల : కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వందలాదిమంది నిరుపేదల ఆశలు అడియాశలవుతున్నాయి. గత పది ఏళ్ల తరబడి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు దేవుడు కరుణించిన కానీ అధికారులు కనికరించరన్న అపవాదిని రెవెన్యూ అధికారులు మూటగట్టుకుంటున్నారు. రేషన్ కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు నెలలు తరబడి రేషన్ కార్డుల కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి కార్యాలయాల్లో ఫైళ్లు కదలాలంటే ౯చేతులు తడవాల్సిందే౯ అన్న విమర్శలు కార్యాలయ వెలుపల్లో వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరు దారుణంగా ఉంది. అర్హులైన నిరుపేదలు మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా, అవి నేటికీ ఎమ్మార్వో లాగిన్‌లలోనే మూలుగుతున్నాయి. విచారణ పేరుతో కాలయాపన చేయడం, సాంకేతిక కారణాలు చెప్పి దరఖాస్తులను తిరస్కరించడం అధికారులకు పరిపాటిగా మారింది. జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎమ్మార్వో కార్యాలయంలో సిబ్బంది అవినీతి అవతారమెత్తిన ౯అప్రూవల్౯ కొందరు అధికారులు, సిబ్బంది పేదవాడి ఆకలిని పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. అర్హత ఉన్నా సరే, రేషన్ కార్డు ఆమోదం పొందాలంటే మధ్యవర్తుల ద్వారా వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ঃঃడబ్బులు ఇస్తేనే పని జరుగుతుందని లేదంటే ఫైల్ పెండింగ్‌లో ఉంటుందనే ధోరణి ఎమ్మార్వో ఆఫీసుల్లో బహిరంగ రహస్యంగా మారింది. లంచం ఇచ్చుకోలేని నిరుపేదలు ప్రభుత్వ పథకాలకు దూరమై తీవ్రంగా నష్టపోతున్నారు. కార్యాలయానికి వెళ్లిన ప్రజలకు అధికారులు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదు. సర్వర్ డౌన్ అని ఒకరు, పై అధికారులు ఇంకా ఆదేశాలు ఇవ్వలేదని ఒకరు తమ దగ్గర ఏమి పెండింగ్ లేదు అంతా జిల్లా స్థాయిలోనే ఉందని మరొకరు సాకులు చెబుతూ తమ బాధ్యత నుంచి తప్పుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు సంక్షేమ పథకాల గురించి మాట్లాడటం తప్ప, క్షేత్రస్థాయిలో ఒక నిరుపేదకు రేషన్ కార్డు ఎందుకు అందడం లేదన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. రేషన్ కార్డు కేవలం బియ్యం కోసమే కాదు, అది ఒక నిరుపేద కుటుంబానికి ఆరోగ్య శ్రీ , పథకాలకు ప్రధాన ఆధారం. కార్డు మంజూరులో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని నిర్దిష్టమైన ఆదేశాలు ఇవ్వాలని నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరుతాయని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

## బెంగళూరు టూ చెన్నై

# ఏపీలో మరో కొత్త రైల్వే లైన్




తిరుపతి, : ఏపీలో మరో కొత్త రైల్వే లైన్ పనులు చాలాకాలంగా నిలిచిపోయాయి. భూసేకరణ పూర్తి చేసినా సరే.. రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులు ఆగాయి. 15 ఏళ్ల క్రితం చిత్తూరు జిల్లా కుప్పం నుంచి కర్ణాటకలోని మారికుప్పం వరకు కొత్త రైల్వే ట్రాక్ ప్లాన్ చేశారు. కర్ణాటకలో పనులు వేగంగా జరుగుతుంటే.. ఏపీలో మాత్రం ఆగాయి. ఈ రైల్వే లైన్ పూర్తి చేస్తే మరిన్ని రైళ్లు నడిపే అవకాశం ఉంటుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. కేంద్రం సహకారంతో నిధులు తీసుకొచ్చి పనులు పరుగులు పెట్టిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆలస్యం అవుతున్న మరో కీలకమైన రైల్వే లైన్ పనులలో కీలక ముందడుగు పడింది. చిత్తూరు జిల్లాకు సంబంధించిన కుప్పం-మారికుప్పం (కర్ణాటక) కొత్త రైల్వే ట్రాక్ పనులు మరింత వేగవంతం చేశారు. ఈ రైల్వే లైన్ సమీపంలో 30 కిలో మీటర్లు వెళితే కర్ణాటక వస్తుంది.. ఇటు తమిళనాడు కూడా ఉంటుంది. కుప్పం రైల్వే స్టేషన్ కూడా చెన్నై-బెంగళూరు రైలు మార్గంలోనే ఉంది. ఈ స్టేషన్ మీదుగా రోజూ రైళ్లు పరుగులు తీస్తూనే ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కుప్పం రైల్వే స్టేషన్ మూడు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉంది. అందుకే ఈ స్టేషన్‌ను ప్రస్తుతం అమృత్ భారత్‌లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పుడు కుప్పం మారికుప్పం (కర్ణాటక) మధ్య కొత్త రైల్వేట్రాక్ పనులు పూర్తి చేసి.. త్వరగా అందుబాటులోకి తీసుకొస్తే ప్యాసింజర్ రైళ్ల సంఖ్య పెరుగుతుంది అంటున్నారు. 2011లో 23.7 కి.మీ పొడవున కుప్పం-మారికుప్పం మధ్య కొత్తగా రైల్వే ట్రాక్ నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ఈ రైల్వే లైన్ పూర్తి చేస్తే మరిన్ని రైళ్లు నడిపే అవకాశం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. కేంద్రం సహకారంతో నిధులు తీసుకొచ్చి పనులు పరుగులు పెట్టిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆలస్యం అవుతున్న మరో కీలకమైన రైల్వే లైన్ పనులలో కీలక ముందడుగు పడింది. చిత్తూరు జిల్లాకు సంబంధించిన కుప్పం-మారికుప్పం (కర్ణాటక) కొత్త రైల్వే ట్రాక్ పనులు మరింతఈ మేరకు అధికారులు భూసేకరణ కోసం ప్రతిపాదనల్లో భాగంగా.. గుడుపల్లె మండలం పరిధిలోన గ్రామాల్లో 238.50, కుప్పం మండలంలోని గ్రామాల్లో 9.15 ఎకరాలు భూసేకరణ చేయాలని నిర్ణయించారు. నాలుగేళ్ల క్రితం భూ సేకరణ కోసం ఆదేశాలు ఇచ్చారు. అయితే కర్ణాటక ప్రాంతంలో భూసేకరణ పనులు పూర్తి చేసుకుని మారికుప్పం నుంచి చిత్తూరు సరిహద్దు వరకు పనులు వేగవంతం చేశారు. ఏపీ పరిధిలో మాత్రం ఈ రైల్వే ట్రాక్‌కు సంబంధించి పనులు చేయలేదు. గత ప్రభుత్వ హయంలో రైతులకు నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించింది.. ఇంకా కొందరికి చెల్లించాల్సి ఉంది.ఈ కొత్త రైల్వే ట్రాక్‌కు సంబంధించి ఏపీ పరిధిలోని గుడుపల్లె, కుప్పం మండలాల్లో భూసేకరణ పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. రైతులకు రూ.1.68 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉందని.. వారికి డబ్బులు చెల్లించిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. కర్ణాటకలోని మారికుప్పం రైల్వే స్టేషన్ నుంచి కొత్త ట్రాక్ ప్రారంభమవుతుంది (అత్తినత్తం, బిసానత్తం, పోగురుపల్లె, కోటచెంబగిరి, కుప్పిగానిపల్లె, అగరం, కనమనపల్లె, గుండ్లసాగరం, నక్కనపల్లె, మల్దేపల్లె) ఏపీలోని కుప్పం రైల్వే స్టేషన్ వరకు ఉంటుంది. అయితే రైతులకు ఆ పెండింగ్ నష్టపరిహారం డబ్బులు విడుదల చేస్తే పనులు మరింత వేగవంతం అవుతాయి అంటున్నారు.

## జగిత్యాల జిల్లాలో దారుణం..

### భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

హైదరాబాద్ : జగిత్యాల జిల్లాలోదారుణం చోటు చేసుకుంది. కట్టుకున్న భార్తను భర్త దారుణంగా హతమార్చాడు. ఈ విషాదకర సంఘటన జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో జరిగిం ది. వివరాల్లోకి వెళ్తే.. మల్లయ్య, సత్తవ్వ దంపతుల మధ్య కొంతకాలం గా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం సత్తవ్వను మల్లయ్య గొడ్డలితో నరికి చంపి పారిపోయాడు. సమాచారం అందు కున్న పోలీసులు



సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఒంటరి జంటల వీడియోలను రికార్డు..

# బ్లాక్ మెయిల్ చేస్తున్న ముఠా

విజయవాడ,: ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఏకాంతంగా ఉండే జంటలను టార్గెట్‌గా చేసుకుంటున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒంటరి జంటల వీడియోలను రికార్డ్ చేస్తూ.. ఆ తర్వాత వారిని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముఠా సభ్యులు ఒకరికొకరు గొడవపడుతూ పోలీసులకు దొరికిపోయారు. వీరి సెల్‌ఫోన్లు పరిశీలిస్తే అనేక వీడియోలు బయటపడినట్లు తెలిసింది. దీంతో వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.ఈజీ మనీ.. సులభంగా డబ్బు సంపాదించే మార్గం ఎలా.. పని చేయకుం డానే పైసలు సంపాదించటం ఎలా.. ఈ మధ్యకాలంలో ఈ తరహా ధోరణి ఎక్కువైపోయింది. ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడి సర్వం కోల్పోయేవారు కొందరైతే.. అక్రమ మార్గంలో డబ్బు సంపాదించేందుకు చెడు మార్గాలు ఎంచుకునే వారు మరికొందరు. మొదటి రకం వారితో సమాజానికి పెద్ద నష్టం లేకపోవచ్చు.. ఎందుకంటే వారికి సొంత నష్టమే తప్ప..పక్కోడికి పోయేదేమీ లేదు. కానీ అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనుకునే వ్యక్తులతోనే అసలు సమస్య. అలాంటి ఘటనే ఎన్టీఆర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ వ్యవహారం గురించి తెలుసుకున్నవారు ఈ రకంగా కూడా డబ్బులు సంపాదిస్తారా అని విస్తుపోతున్నారు.ఎన్టీఆర్ జిల్లా నందిగామలో ఈ మధ్య ఆకతాయిల ఆగడాలు శ్రుతిమించుతున్నా?యి. మద్యం మత్తులో నేరాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే ఓ కొత్త ముఠాను నందిగామ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్ అరాచకాలు తెలుసుకున్న పోలీసులు.. షాక్ తిన్నారు. అయితే ఈ గ్యాంగ్ వ్యవహారం ఎవరో ఫిర్యాదు చేస్తే కాకుండా వారి స్వయం కృతాపరాధంతో బయటకు వచ్చింది. కొంతమంది యువకులు గొడవపడుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. పరిశీలిస్తే పోలీసులు విస్తుపోయే వీడియోలు వెలుగు చూశాయి.మద్యానికి బానిసలుగా మారి.. ఈజీ మనీకి అలవాటు పడిన కొంతమంది యువకులు.. ఒంటరి జంటలను లక్ష్యంగా చేసుకుని అరాచకాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఖాళీ ప్రదేశాల్లో ఒంటరిగా ఉండే జంటలను గమనించటం.. ఆ తర్వాత వా రిని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముఠా సభ్యులు ఒకరికొకరు గొడవపడుతూ పోలీసులకు దొరికిపో యారు. వీరి సెల్‌ఫోన్లు పరిశీలిస్తే అనేక వీడియోలు బయటపడినట్లు తెలిసింది. దీంతో వీరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తు న్నారు.ఈజీ మనీ.. సులభంగా డబ్బు సంపా దించే మార్గం ఎలా..వారిని దొంగచాటుగా వీడియోలు తీయటం మొదలుపెట్టిన ఈ ముఠా.. ఆ తర్వాత ఈ వీడియోలను చూపించి వారిని బ్లాక్ మెయిల్ చేసేవారు. వారి నుంచి డబ్బులు వసూలు చేసేవారు. పోలీసులు వీరి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తే.. ఫోన్లలో ఇలాంటి వీడియోలు లభ్యమయ్యాయి. చాలా మంది జంటల నుంచి ఈ రకంగా డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.వాటాల పంపిణీలో గొడవలు రావటంతో రోడ్డుపై ఒకరికొకరు ఘర్షణకు దిగారు. ఈ సమయంలోనే పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

# అమ్మ సంతోషమే ముఖ్యం



టాలీవుడ్ నటి సురేఖా వాణి ఆమె కూతురు సుప్రిత నాయుడు మధ్య ఉన్న అనుబంధం గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తల్లీకూతుళ్లు స్నేహితుల్లా కలిసి ఉండటం, సోషల్ మీడియాలో తరచూ ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తూ సందడి చేయడం తెలిసిందే. వారి ఆప్యాయత, ఓపెన్ బాండింగ్ ఎప్పుడూ చర్చనీయాంశం అవుతుంది. ఇటీవల సుప్రీత తన తల్లి భవిష్యత్తు గురించి చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. భర్త మరణం తర్వాత సురేఖ వాణి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆమెకు కూతురు సుప్రీత ప్రధాన ఆధారం అయింది. ఇప్పుడు అదే కూతురు తన తల్లి జీవితంపై తీసుకున్న నిర్ణయం అందరినీ ఆకట్టుకుంటోంది. నేను పెళ్లి చేసుకునే ముందు, నాఅమ్మకు జీవితంలో ఒక మంచి తోడు ఉండాలి. ఆమెను ప్రేమగా చూసుకునే, గౌరవించే వ్యక్తి రావాలి అని సుప్రీత వెల్లడించింది. ఈ విషయాన్ని తాను కుటుంబ సభ్యులతో కూడా చర్చించానని, వారు కూడా తన అభిప్రాయానికి మద్దతు తెలిపారని చెప్పింది. అయితేఇది కేవలం తన కోరిక మాత్రమే కాదని ఆమె స్పష్టం చేసింది. “అమ్మ సంతోషమే నాకు ముఖ్యం. ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా నేను గౌరవిస్తాను. నాన్న స్థానాన్ని మరెవరికి ఇవ్వాలని ఆమెకు ఇష్టం లేదు. ఆమెను బలవంతం చేయను. కానీ అమ్మ ఒంటరిగా ఉండకూడదని మాత్రమే నేను కోరుకుంటున్నాను” అంటూ ప్రేమతో చెప్పిన మాటలు సోషల్ మీడియాలో హృదయాలను తాకుతున్నాయి. ఇప్పటికీ వితంతువుల రెండో పెళ్లిపై సమాజంలో మిశ్రమ అభిప్రాయాలు ఉన్నప్పటికీ, తల్లి భవిష్యత్తు కోసం ముందుగా ఆలోచిస్తున్న సుప్రీత నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు. తల్లికి మంచి జీవితం కావాలని కోరుకునే కూతురి మనసు నిజంగా ప్రశంసనీయమని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. తల్లీకూతుళ్ల మధ్య ఉన్న ఈ ఆప్యాయ బంధం మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. కాగా, సుప్రీత ప్రస్తుతం టాలీవుడ్‌లో హీరోయిన్‌గా సత్తా చాటుతుంది.

# చిన్న పిల్లలపై అత్యాచారాలు అరికట్టాల్సిందే



తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు పొందిన వరలక్ష్మి శరత్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చిన్నారులపై జరిగే అత్యాచారాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజానికి పెద్ద ప్రమాదంగా మారుతున్నాయని ఆమె అన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ‘చిన్న పిల్లలను హరాస్ చేసే వాళ్లను, అత్యాచారం చేసే వాళ్లను అసలు వదిలిపెట్టకూడదు. వాళ్లకు సాధారణంగా మరణశిక్ష ఇవ్వడం సరిపోదు. అలాంటి వాళ్లకు మరింత కఠినమైన శిక్షలు ఉండాలి, కట్ చేసి పడేయాలి‘ అని వరలక్ష్మి పేర్కొన్నారు.నేను ఎప్పుడైనా ముఖ్యమంత్రి అయితే రేప్ లాంటి నేరాలకు పాల్పడే అబ్బాయిలకు కఠినమైన శిక్ష విధించేలా ప్రత్యేక చట్టం తీసుకువస్తాను. అప్పుడు అలాంటి నేరాలు చేయడానికి కూడా వాళ్లు భయపడతారు. సమాజంలో ఆ భయం రావాలి అని ఆమె అన్నారు. అదే సమయంలో పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని వరలక్ష్మి సూచించారు. చిన్నారులకు చిన్నప్పటి నుంచే ’గుడ్ టచ్’, ’బ్యాడ్ టచ్’ గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలకు ధైర్యం ఇవ్వడం, ఏదైనా తప్పు జరిగితే చెప్పేలా వారికి నమ్మకం కల్పించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన సరస్వతి సినిమా చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో రూపొందిన సామాజిక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కింది.

# బొద్దింకలు వ్యాధుల కారకాలు



బొద్దింకల్ని చూడగానే చిరాకు పుడుతుంది. ఈ విషయం అలా ఉంచితే బొద్దింకలు ఎన్నో వ్యాధులకు కారణమవుతాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్ధులు బొద్దింకల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వీటి ద్వారా వ్యాపించే కొన్ని ముఖ్యమైన వ్యాధుల గురించి తెలుసుకుని ఉండాలి.ఫుడ్ పాయిజనింగ్: అపరిశుభ్ర వాతావరణంలో తిరిగే బొద్దింకలు తాకితే మనం తాగేనీళ్ల, తినే ఆహారం కలుషితమవుతాయి. దీంతో ఫుడ్ పాయిజనింగ్ జరుగుతుంది. దీనివల్ల కడుపునొప్పి,

వాంతులు, డయేరియా (అతిసారం), జ్వరం లాంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్ (ఓఆర్ఎస్)తో తగ్గించుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో యాంటిబయాటిక్స్ అవసరమూ ఉంటుంది.టైఫాయిడ్: బొద్దింకల నుంచి వచ్చే వ్యాధుల్లో తీవ్రమైనది టైఫాయిడ్. ఇది సాల్మొనెల్లా టైఫి అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. కలుషిత జలం తాగినప్పుడు, కలుషిత ఆహారం తిన్నప్పుడు ఈ క్రిమి మన శరీరాల్లో చేరిపోతుంది. తీవ్రమైన జ్వరం, బలహీనత, తలనొప్పి, కొన్నిసార్లు మలబద్ధకం, ఇంకొన్నిసార్లు డయేరియా (అతిసారం).. ఇవి టైఫాయిడ్ లక్షణాలు. క్రిమి సోకిన 12 నుంచి 72 గంటల్లో టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తాయి. తగినంత విశ్రాంతి, యాంటిబయాటిక్స్‌తో దీన్నుంచి విముక్తి పొందొచ్చు.

కలరా: బొద్దింకల నుంచి వ్యాపించే మరో వ్యాధి కలరా. అపరిశుభ్రమైన పరిసరాల కారణంగా కలరా సోకుతుంది. అతిసారం, నీళ్ల విరేచనాలు, వాంతులు మొదలైనవి దీని లక్షణాలు. డీహైడ్రేషన్ సమస్య ఉంటే ఐవీ ఫ్లూయిడ్స్, యాంటిబయాటిక్స్ అవసరమవుతాయి. పరిశుభ్రతే ప్రధానం: బొద్దింకల మూలంగా వ్యాధులు రాకూడదనుకుంటే ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారంపై మూతలు పెట్టాలి. చెత్తబుట్టలను క్రమం తప్పకుండా కడిగి శుభ్రం చేస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి పెస్ట్ కంట్రోల్ చేయిస్తూ ఉండాలి. చికిత్స కంటే వ్యాధి రాకుండా నివారించుకోవడం ఉత్తమం. అనుకోకుండా బొద్దింకల వల్ల ఫుడ్ పాయిజనింగ్ లాంటి సమస్యలు, ఇతర లక్షణాలు కనిపిస్తే సత్వరమే వైద్య సహాయం పొందాలి.

# సినిమా

## ‘వారణాసి’ నెక్ట్స్ షెడ్యూల్‌పై హింట్ ఇచ్చిన ప్రియాంక చోప్రా



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం ‘వారణాసి’పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం జార్జియాలో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంటోంది. ఈ యాక్షన్ అడ్వెంచర్ డ్రామాలో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కీలక పాత్రలో నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. అలాగే ప్రకాష్ రాజ్, ఆర్. మాధవన్ వంటి అగ్ర నటులు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం సినిమాకు మరింత బలం చేకూరుస్తోంది. ఇటీవల ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ చిత్రం ‘ది బ్లఫ్’ను చూసిన మహేష్ బాబు, ఆమె నటనపై ప్రశంసలు కురిపించారు. దీనికి ప్రియాంక “సీ యూ సూన్ ఇన్ అంటార్కిటికా” అంటూ రిప్లై ఇవ్వడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఈ కామెంట్‌తో ‘వారణాసి’ నెక్ట్స్ షెడ్యూల్ అంటార్కిటికాలో జరగనుందనే ఊహాగానాలు మొదలయ్యాయి. విభిన్నమైన లొకేషన్లు, భారీ విజువల్స్ రాజమౌళి సినిమాల ప్రత్యేకత అన్న విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే జార్జియా అడవుల్లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు అంటార్కిటికా షెడ్యూల్ ఉంటే, అది భారతీయ సినీ చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలిచే అవకాశముంది. ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు. కథను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ అందించగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం సమకూరుస్తున్నారు. విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ చిత్రాన్నిఐమ్యాక్స్ అనుభూతిని ఇచ్చేలా రూపొందిస్తున్నారని సమాచారం.‘వారణాసి’ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో ఏప్రిల్ 7, 2027న విడుదల చేయాలని చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. రాజమౌళి–మహేష్ బాబు కాంబినేషన్ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంతర్జాతీయ స్థాయిలో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే జార్జియా షెడ్యూల్ ముగిసిన తర్వాత అంటార్కిటికాలో చిత్రీకరణ ఉంటుందా? అన్న ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. మొత్తానికి ‘వారణాసి’ ఇండియన్ సినిమా స్థాయిని మరింత ఎత్తుకు తీసుకెళ్లే ప్రాజెక్ట్‌గా మారుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# సల్మాన్‌కు జోడీగా నయనతార





దక్షిణాదిన అగ్రస్థానంలో ఉన్న కథానాయిక ఎవరంటే.. ’నయనతార’ అని టక్కున చెప్పేస్తారు. పారితోషికం పరంగా కూడా నయనే నంబర్ వన్. ప్రస్తుతం ఆ భాష, ఈ భాష అని లేకుండా, అన్ని భాషల్లోనూ సినిమాలు చేస్తూ సత్తా చాటుతున్నది నయనతార. మెగాస్టార్‌తో ఆమె రీసెంట్ హిట్ ’మన శంకర వరప్రసాద్‌గారు’ టాలీవుడ్ రీజనల్ సినిమాల్లో నంబర్‌వన్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం బాలకృష్ణ ’ఎన్‌బికె 111’లో కథానాయికగా నటిస్తున్నది నయనతార. ఇక తమిళంలో అయితే.. ఆమె చేతిలో చాలా సినిమాలున్నాయి. ఇదిలావుంటే.. రీసెంట్‌గా ఓ బాలీవుడ్ సినిమాకు నయన్ సైన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్‌ఖాన్ హీరోగా రూపొందనున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి టాలీవుడ్ డైరెక్టర్ పైడిపల్లి వంశీ దర్శకుడు. దిల్‌రాజు నిర్మిస్తారట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది. ఇక నయన్ నటించిన తమిళ చిత్రం ’ముక్తీ అమ్మన్’ సమ్మర్‌లో విడుదల‌కానుంది.

# చిత్ర పరిశ్రమలో ట్రోల్స్ పెద్ద పదం

## ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నా

విమర్శల నుంచి నేను చాలా నేర్చుకున్నానంటోంది హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్. ’మేడ్ ఇన్ కొరియా’ సినిమాతో త్వరలోనే వీక్షకులందరికీ కొరియా సంస్కృతిని పరిచయం చేసే తమిళ అమ్మాయిగా ఓటీటీలో సందడి చేయనుంది. ఈ సందర్భంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి స్పందించింది. ‘సోషల్ మీడియాలో ’ట్రోల్స్’ అనేది చాలా పెద్ద పదం. గతం గురించి ఆలోచించడం నాకు ఇష్టం లేదు. కానీ, ఇది చిత్రపరిశ్రమ. అనిశ్చితమైన పరిస్థితులు ఎదురవుతాయి. ఇక్కడ ఎవరికైనా ఏదైనా జరగొచ్చు. నేను దాని నుంచే చాలా నేర్చుకున్నాను. సహజంగానే ట్రోల్స్ బాధించినా ఎదగడానికి తోడ్పడతాయి. కొన్నిసార్లు మీరు పడిపోతేనే పైకి రావడానికి అలాంటివి సహాయపడతాయి. నేను ఇలాంటి ప్రతికూల పరిస్థితులను సానుకూలంగా మార్చుకుంటూ కెరీర్‌ని ముందుకు తీసుకెళ్లాలనుకుంను‘ అని చెప్పింది. గతంలో ప్రియాంక తనపై కొందరు ఉద్దేశపూర్వకంగానే ట్రోల్స్ చేస్తున్నట్లు వెల్లడించిన సంగతి తెలిసిందే.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209.“
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411